క్లుప్తంగా

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



పనులు పరిశీలిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని మంథని డివిజన్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీశ్‌కుమార్ అన్నారు. రామగిరి మండలం సుందిళ్లలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా నిరంతరం సక్రమంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్త వేరుగా సేకరించాలన్నారు. నర్సరీని పరిశీలించారు. కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కందునూరిపల్లెలో శ్రీశ్రీశ్రీ సంకట విమోచన రామ భక్త శివ పంచాయతన ఆలయ తృతీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, నవగ్రహ పూజలు, నక్షత్ర పూజ, హనుమాన్ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ స్వరూప-తిరుపతి, మాజీ ఎంపీటీసీ హనుమక్క-రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



బాండ్ పత్రాలు అందజేస్తున్న స్నేహితులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తీగల నరేశ్ ఇటీవల మృతి చెందాడు. కాగా నరేశ్‌తో పాటు 2008–09లో ఎస్సెస్సీ చదివిన పూర్వ విద్యార్థులు మృతుడి కుటుంబానికి చేయూత అందించారు. నరేశ్ ఇద్దరు కుమార్తెలకు ఒక్కొక్కరికి రూ.12,500 చొప్పున మొత్తం రూ.25వేలు సుకన్య సమృద్ధి యోజన పథకం కింద పోస్టల్‌లో జమ చేసి, బాండ్ పత్రాలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆకుల హరీశ్‌గౌడ్, మహేందర్, సందీప్, సతీశ్ పాల్గొన్నారు.

కల్వర్టుల వద్ద జాగ్రత్త చర్యలు

కాల్వశ్రీరాంపూర్: వర్షాలతో ఒర్రెల నీటి ప్రవాహం వేగంగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు, వ్యవసాయ రైతులు, వ్యవసాయ కూలీలు కల్వర్టులు దాటొద్దని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు హితవు పలికారు. వర్షాలతో వరదనీటి ప్రవాహ వేగం ఉధృతంగా ఉండటంతో కాల్వశ్రీరాంపూర్–జమ్మికుంట ఆర్‌అండ్‌బీ రహదారిపై, కాల్వశ్రీరాంపూర్–పెద్దపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి అంకంపల్లి–మడిపెల్లి వద్ద ఒర్రెపై ట్రాక్టర్లు అడ్డుపెట్టి రాకపోకలు నిలిపివేశారు.

పైపులైన్‌లు లీకేజీ కాకుండా చూడాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: వర్షాకాలంలో రక్షిత మంచినీటి పైపులైన్‌లు లీకేజీ కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో లీకేజీ అయిన పైపులైన్ మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌తో పాటు ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

పాలకుర్తి: మండల పరిధిలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో బుధవారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపికలు, రాధాకృష్ణుల వేషధారణతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ ఇస్మాయిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అఫ్జల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య నిలుస్తున్న మురుగు

- డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్న 23వ డివిజన్ శాంతినగర్‌వాసులు
- పట్టించుకోని అధికారులు



శాంతినగర్‌లో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగునీరు

ఫెర్టిలైజర్‌సిటీ: అసలే వర్షాకాలం.. అందులో డెంగీ, మలేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. డ్రైనేజీ నీరు, వర్షపు నీరు కాలనీలో ఎక్కువ రోజులు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రభుత్వాలు మారినా కాలనీలో డ్రైనేజీ నిర్మించడంలో నిర్లక్ష్యం వహించడంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షం నీరు, డ్రైనేజీ మురుగునీరు ఇళ్ల మధ్యలో నిలుస్తోంది. ఇది రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ శాంతినగర్ దుస్థితి.

కాలనీలో నెలల తరబడి సమస్య..

వర్షాకాలం వచ్చిందంటే కాలనీలో ఇల్లు నీట మునగాల్సిందే. సంజయ్‌గాంధీనగర్‌లోని ఆర్‌ఎఫ్‌సీఎల్ వాటర్ స్టోరేజ్ పాండ్ ఉంటుంది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు వెళ్లేందుకు కాలనీలో డ్రైనేజీలు లేవు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వ్యాపించి కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. నగరపాలక అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

బోధనోపకరణాలతో పాఠాలు సులభం



ఓదెల: పరికరాలు పరిశీలిస్తున్న డీఈవో మాధవి

ఓదెల: బోధనోపకరణాలతో పాఠాలు విద్యార్థులకు సులభంగా అర్థమవుతాయని డీఈవో మాధవి తెలిపారు. ఓదెల ఎంఈవో రమేశ్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. డీఈవో హాజరై మాట్లాడారు. ఎంపీడీవో తిరుపతి, ఎస్సై రమేశ్ పాల్గొన్నారు.

పాఠాలు సులభంగా అర్థం కావాలి

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు తయారు చేసే సామగ్రి మల్టీగ్రేడ్‌గా ఉండాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు. గర్రెపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో టీచింగ్, లెర్నింగ్, మెటీరిల్(బోధన అభ్యసన సామగ్రి) కార్యక్రమం నిర్వహించారు. ఏంఈవో రాజయ్య అధ్యక్షత వహించారు. డీఈవోపాటు అకడమిక్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్ పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు దివాకర్, కవిత, రత్నాకర్, డీఆర్పీలు ప్రభాకర్‌రెడ్డి, రాజమల్లు, శివలీల తదితరులు ఉన్నారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం



నిరసనలో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి అధికారుల పీఆర్‌పీతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆర్జీ–1 అధికారులు రెండోరోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, క్వాలిటీ జీఎం భైద్య, అధికారుల సంఘం నాయకులు పొనుగోటి శ్రీనివాస్, నాయకులు మల్లేశం, పెరుమాల శ్రీనివాస్, డాక్టర్ విష్ణు, కోలా మల్లేశ్, దామోదర్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై త్రివర్ణ జెండా ఎగరాలి



మంథని: తిరంగా యాత్రలో సునీల్‌రెడ్డి



జిల్లా కేంద్రంలో ర్యాలీ



జూలపల్లిలో తిరంగా యాత్ర..

మంథని: ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి కోరారు. మంథని పట్టణశాఖ అధ్యక్షుడు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా సాగిన ఈ హర్ ఘర్ తిరంగా ర్యాలీలో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

సుల్తానాబాద్: జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాకేశ్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, మండల అధ్యక్షులు వేల్పుల రమేశ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కావేటి రాజగోపాల్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్, బీజేవైఎం జిల్లా నాయకులు జ్యోతిబసు ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు.

యూరియా నిల్వచేస్తే ఆవిరైపోతుంది

మంథని: మంథని మండలంలో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.అంజని తెలిపారు. మంథనిలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేసి సూచనలు చేశారు. ప్రతీ దుకాణంలో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ముందస్తు యూరియా కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని, ఒకవేళ యూరియా చేస్తే ఆవిరైపోతుందని, పంటకు పనికిరాదని పేర్కొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం సహించం

గోదావరిఖని: సింగరేణిలో రాజకీయ జోక్యం సహించేదిలేదని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ అన్నారు. గోదావరిఖనిలో యూనియన్ సెంట్రల్ ఆఫీస్ బేరర్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిందని, యాజమాన్యం రాజకీయ జోక్యాన్ని అరికట్టకుంటే ఊరుకునేది లేదన్నారు. నాయకులు మిర్యాల రంగయ్య, ఎల్.ప్రకాశ్, వైవీరావు, మడ్డి ఎల్లాగౌడ్, సమ్మయ్య, వీరభద్రం, అన్ని ఏరియాల కేంద్ర నాయకులు, బ్రాంచి కార్యదర్శులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ పరిరక్షణకు కలిసి పనిచేస్తాం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థ పరిరక్షణ కోసమే హెచ్‌ఎంఎస్ యూనియన్, జాగృతి సేవా సంస్థతో కలిసి పనిచేస్తుందని హెచ్‌ఎంఎస్ జాతీయ కార్మిక సంఘం నేత ఎండీ ఇస్మాయిల్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక నుంచి స్వచ్ఛంద సంస్థ అయిన జాగృతి, హెచ్‌ఎంఎస్ యూనియన్ సింగరేణిని కాపాడుకోవడంతో పాటు, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కలిసి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొమ్ము మధునయ్య, శాంతి స్వరూప్, రాజశేఖర్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాసాని విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

మంథని: హమాలీ సంఘం డివిజన్ నాయకుడు బాసాని రాజయ్య విగ్రహం ఏర్పాటుకు స్థానిక హమాలీ సంఘం ఎదుట బుధవారం భూమిపూజ చేశారు. రాజయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు హమాలీ కార్మికులు, నాయకులు తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొడుదుల వెంకన్న, హమాలీ సంఘం అధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, ఆర్టీఏ మెంబర్ మంథని సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆకుల కిరణ్, ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెంద్రి రమ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, మాజీ ఎంపీపీ కొండ శంకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• పీజీటీ ఇంగ్లిష్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ముత్తారం: మండలంలోని ధర్యపూర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో పీజీటీ ఇంగ్లిషు బోధించడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లుప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. పీజీలో ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకుని డెమోకు హాజరుకావాలని సూచించారు.

• హఠాత్తుగా కుప్పకూలిన ఏఎన్‌ఎం.. ఆస్పత్రికి తరలింపు

కాల్వశ్రీరాంపూర్: టీకాలు తీసుకెళ్లేందుకు వెళ్లిన ఏఎన్‌ఎం హఠాత్తుగా ఆస్పత్రిలో కుప్పకూలిన ఘటన మండలంలోని కూనారం పీహెచ్‌సీలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వెన్నంపల్లి ఏఎన్‌ఎం శైలజ వ్యాక్సినేషన్ తీసుకువెళ్లేందుకు కూనారం పీహెచ్‌సీకి చేరుకున్నారు. కూలింగ్ డబ్బాలో టీకా మందు సర్దుతుండగా ఒక్కసారిగా కుప్పకూలారు. అప్రమత్తమైన వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కుటుంబసభ్యులు హన్మకొండలోని మరో ఆస్పత్రికి తరలించారు.

• సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాల్వశ్రీరాంపూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్ అన్నారు. మండలంలోని పందిల్లలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మురికి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వేశారు.

• మండలంలో భారీ వర్షం

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షంతో గ్రామాల్లోని చిన్ననీటి పారుదల కుంటలకు స్వల్ప వరద వచ్చింది. మండలంలో 58.6 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు ఎస్‌వో తెలిపారు.

• వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఇప్పలపల్లె రెడ్డి ఫంక్షన్‌హాల్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోలివాడకు చెందిన గంగయ్యను కారు ఢీకొన్నది. ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. బాధితుడి తలకు, కాలుకు గాయాలు కావడంతో చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మీర్జంపేటలో ఎండీ బాషుమియా వర్షానికి ఇల్లు ఉరుస్తుండటంతో ఇంటిపై కవర్ కప్పుతుండగా 11కేవీ విద్యుత్ తీగ తలకు తగిలి కరెంట్ షాక్‌కు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స కోసం జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.

• బాయమ్మపల్లెలో కూలిన ఇల్లు..

ఓదెల: మండలంలోని బాయమ్మపల్లెలో కుక్కల మధురమ్మ నివసిస్తున్న ఇల్లు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కూలింది. పైకప్పు, గోడలు అకస్మాత్తుగా కూలాయి. కాగా మధురమ్మ ప్రాణాలతో బయటపడింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆమె వేడుకుంది.

• కేసు నమోదు

జ్యోతినగర్: ఎన్టీపీసీ ఠాణా పరిసరాల్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన బోయిని రవి మంగళవారం సివిల్ కేసుకు సంబంధించిన విషయంపై స్టేషన్ పరిసరాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స నిమిత్తం గోదావరిఖని ఆస్పత్రికి తరలించారు. స్టేషన్ పరిధిలో రవి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించిన అంశంపై బీఎన్ఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు.

• రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ ఎదురుగా రాజీవ్ రహదారి నుంచి వెళ్లే కృష్ణానగర్ క్రాస్ రోడ్డుపై కారు, బైక్ ఢీకొన్న ఘటనలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి కృష్ణానగర్‌కు చెందిన రవీందర్ తన భార్య లక్ష్మిని బైక్‌పై తీసుకెళ్తుండగా రాజీవ్ రహదారి నుంచి కృష్ణానగర్‌కు వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో లక్ష్మి కాలుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కృష్ణానగర్‌కు వెళ్లే క్రాస్‌రోడ్డు ఇరుగ్గా ఉండటం, వ్యాపారులు రోడ్డు ఆక్రమించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

• లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

ఓదెల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని మానేరు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, లోలెవల్ కల్వర్టులను బుధవారం ఆయన పరిశీలించారు.

• అంతుచిక్కని వ్యాధితో గేదెల మృతి

రామగుండం: అబాది రామగుండంలోని అప్పాసి లింగయ్య అనే పాడి రైతుకు చెందిన నాలుగు పాడి గేదెలు మూడురోజుల వ్యవధిలో అంతు చిక్కని వ్యాధితో మృతిచెందాయి. మరో రెండు గేదెలు వ్యాధిబారిన పడ్డాయి. దీంతో రైతు తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. ఈ విషయమై వెటర్నరీ అసిస్టెంట్ దొంగరి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా దోమకాటు బారిన పడి మృతిచెందినట్లుగా పేర్కొన్నాడు. దోమకాటుకు గురైన గేదెలు రక్తహీనతకు గురై శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికి గురై ఆక్సిజన్ లెవల్స్ పడిపోయి మృతిచెందినట్లు గుర్తించామని వివరించారు. గేదెలను నిలిపే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. అప్పాసి లింగయ్యకు చెందిన మిగతా రెండు గేదెలకు చికిత్స చేస్తున్నామని తెలిపారు.

రహదారిపై నీరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



పాలకుర్తి: మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న నీటిని అధికారులు సిబ్బందితో తొలగించారు. బసంత్‌నగర్ నుంచి పాలకుర్తి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై నీళ్లు నిలుస్తున్నాయి. వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బుధవారం ఇదేమి 'దారి'ద్ర్యం అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో రామ్మోహనచారి, ఎంపీవో సుదర్శన్ స్పందించారు. జేసీబీ సాయంతో నీటిని వేరే వైపు మళ్లించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారిపై కూలిన చెట్లకొమ్మలను తొలగించారు.

సింగరేణి వార్తలు

యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

గోదావరిఖని: భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. ఏరియాలోని ఓసీపీ–3 కృషిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోలిండియా సంస్థలతో పోల్చితే సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వ్యయం పెరుగుతోందన్నారు. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన డంపర్లు, షావల్స్, గ్రేడర్ల రోజువారీ పనిగంటలు పెంచాలని సూచించారు. ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్, అధికారులు సుజన్‌మెహ్రా, పర్సనల్ డీజీఎం అరవిందరావు, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, ప్రాజెక్టు ఇంజినీర్ రాజాజీ, ఏజెంట్ ఉదయ్‌హరిజన్, మేనేజర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

సింగరేణిలో యాంటీ డ్రగ్ డే



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1లో యాంటీ డ్రగ్ డే బుధవారం నిర్వహించారు. మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. డీవైపీఎం వేణు, ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మి బాయి, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఆడిట్ అధికారి మోహన్‌రావు, ఏఐటీయూసీ నాయకులు పద్మ, సీఎంఓఏఐ నాయకులు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో..

మాదకద్రవ్యాల వియోగానికి ప్రతీఒక్కరు దూరంగా ఉండాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య సూచించారు. బుధవారం జీఎం కార్యాలయంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఎస్‌వోటూ జీఎం ఎస్.సంతోష్‌కుమార్, డీజీఎం పర్సనల్ అరవింద్‌రావు, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, సివిల్ డీజీఎం ధనుంజయ, పర్చేజ్ ఎస్‌ఈ పండరీనాథ్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రామగిరి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కొనసాగాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. జీఎం కార్యాలయంలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, రవికుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ, ఎస్‌వోటూ జీఎం ఎం.రామ్మోహన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భాను ప్రసాదరావు, ఐఈ డీజీఎం కె.చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సర్వే అధికారి జనార్దనరెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బీరుద్దీన్, పర్చేజ్ అధికారి ఇ.నాగేశ్వరరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగులు పనివిధానం మెరుగుపర్చుకోవాలి

గోదావరిఖని: భూగర్భగనుల్లో పనిచేసే ఉద్యోగులు పనివిధానాన్ని మరింత మెరుగుపర్చుకోవాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. జీడీకే–2, 2ఏ గనిపై బుధవారం మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. సంస్థ పురోభివృద్ధిలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుకోవడానికి సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, గ్రూప్ ఏజెంట్ రమేశ్, క్వాలిటీ డీజీఎం బ్రహ్మాజీ, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ రమేశ్‌బాబు, గనికి చెందిన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో లక్ష్యాలను సాధించాలి

రామగిరి: అనుక్షణం భద్రతతో విధులు నిర్వహిస్తూ సమష్టి కృషితో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు ఆదేశించారు. ఓసీపీ–2లో బుధవారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో కూడిన ఉత్పత్తి సాధించడానికి కృషి చేయాలని సూచించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, పీవో సీహెచ్ వెంకటరమణ, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, ఫైనాన్స్ ఆఫీసర్ విక్రమ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజం కోసం కృషి



యైటింక్లయిన్‌కాలనీ: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: మాదక ద్రవ్య రహిత సమాజ కోసం ప్రతీఒక్కరు సహకరించాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై రవళి కోరారు. జిల్లా కేంద్రంలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో నశాముక్త్ భారత్ చేపడుతున్న కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. నషాముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ శ్యామల, చైల్డ్‌లైన్ సిబ్బంది, ఐసీపీఎస్, డి అడిక్షన్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ

యైటింక్లయిన్‌కాలనీ: నషాముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

ముత్తారం: డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత చెడిపోవద్దని హెడ్ కానిస్టేబుల్ మధునయ్య హితవుపలికారు. ముత్తారంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసులు బుధవారం మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేనిదే వాహనాలు నడపొద్దన్నారు. కానిస్టేబుల్ సౌజన్య, కళాశాల ప్రిన్సిపాల్ జీఎల్ఎన్ రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బోధనోపకరణాల మేళా

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు, సులభంగా అర్థం చేసుకునేందుకు చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా బుధవారం కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన బోధనోపకరణాల మేళా ఆకట్టుకుంది. ఉత్తమమైన పది ప్రదర్శనలు జిల్లా స్థాయిలో ప్రదర్శించేందుకు ఎంపిక చేసినట్లు ఎంఈవో సిరిమల్ల మహేశ్‌కుమార్ తెలిపారు.

మండలస్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్ మేళా

జూలపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(బాలురు) బుధవారం ఎఫ్ఎల్ఎన్ మండల స్థాయి మేళా నిర్వహించారు. ఈ మేళాలో ఎంఈవో సరస్వతి పాల్గొని మాట్లాడారు. టీఎల్ఎం మేళాలో ఎంపికైన పాఠశాలలు 20న జెడ్పీహెచ్‌ఎస్ గర్రెపల్లి, సుల్తానాబాద్‌లో జరిగే మేళాలో పాల్గొనాలన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిందని సీఐటీయూ ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, లేకుంటే కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. సంపత్, రాంప్రసాద్, నరసింహ, భూమయ్య, లక్ష్మీరాజం, సాంబరావు, సారంగం, వినేష్, విజయ్ రాజ్, జగదీష్ పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీల చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలకుర్తి: మండలంలోని కన్నాలలో బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఉమ్మడి కన్నాల గ్రామస్తులకు దశాబ్దాల కాలంగా ఉన్న రైల్వేగేట్ సమస్య పరిష్కారం కోసం నూతన ఆర్‌వోబీ నిర్మాణానికి రైల్వేశాఖ ఇటీవల నిధులు విడుదల చేసింది. ఇందుకు కృషి చేసిన మంత్రి, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తొగరి తిరుపతి, అరుకాల సతీశ్, లాల్‌సింగ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో వనమహోత్సవం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ఈజీఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపూర్ నుంచి భూపాలపట్నం రోడ్డు వెంట మొక్కలు నాటి రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. ఎఫ్ఏ మల్లేశం పాల్గొన్నారు.